"మీ కోరికలు తీరడానికి నా మహాత్యమే కారణమని నువ్వనుకుంటున్నావు. కాని అది సరికాదు. బ్యాంక్ కేషియర్ దగ్గరకి వెళితే, కొందరికి అతను లక్షలు చెల్లిస్తాడు. కొందరికి వేలు ఇస్తే మరికొందరికి వందలే ఇస్తాడు. వాళ్ళు తమ ఖాతాల్లో జమ చేసుకున్నదాంట్లోంచే ఆ కేషియర్ ఇస్తున్నాడు తప్ప తన జేబులోంచి తీసివ్వడం లేదు కదా? మహాత్ములు కూడా ఆ బ్యాంక్ కేషియర్ లాంటివారే. తమని కోరేవారు ఆ కోరిక తీర్చుకోవడానికి సరిపడే పుణ్యం ముందే జమ చేసుకుని వుంటే, దాన్ని తీరుస్తారు. జమ లేకపోతే ఎవరూ ఏంచేయలేరు. కనుక వెళ్ళి భజన, నామస్మరణ, సేవ లాంటి పుణ్యకార్యాలు చేయడం మొదలు పెట్టు. పుణ్యం అనే బేంక్ బేలన్స్‌ని పెంచుకుంటే నువు కోరుకుంది నీకు దక్కుతుంది. ఎవరినీ అడగక్కర్లేదు."

తర్వాతి సంవత్సరం ఆ సాధువు ఆ ఊరికి మళ్ళీ వచ్చాడు. అతను తిరిగి సాధువుని కలిసి ఆయన చెప్పినట్లే చేస్తున్నానని చెప్పాడు.

"పాతికేం ఖర్మ. నీకు వంద రూపాయల ఇంక్రిమెంట్ వస్తుంది పో." చెప్పాడు సాధువు.

## 36. ఆలోచనా గంగ

కర్మవశాత్తూ ఒకతనికి కుష్టువ్యాధి వచ్చింది. అన్నిరకాల వైద్యాలు చేయించాడు. ఐనా అతని వ్యాధి తగ్గలేదు. కాశీకి వెళ్ళి గంగలో స్నానం చేస్తే ఆ వ్యాధి నయమవ్వచ్చని ఎవరో చెప్పారు.

"మనుషుల పాపాలని స్వీకరించడానికే గంగ భగీరథుడి వెంట స్వర్గలోకం నించి భూమి మీదకి వచ్చింది." చెప్పారు వాళ్ళు.

అతనికి ఆశ కలిగింది. చాలా రోజులు ప్రయాణం చేసి కాశీ చేరుకున్నాడు. అతనికి ఎంతో కుతూహలంగా వుంది. నిజంగా ఈ రోగం గంగా స్నానంతో పోతుందా? అనుకుంటూ, చీకటి పడటంతో ఓ చెట్టు కింద విశ్రమించాడు.

మర్నాడు ప్రాతఃకాలానే నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకుని గంగా నది ఒడ్డుకి చేరుకున్నాడు. తన గ్రామంలోని చిన్న చెరువు తప్ప అంతదాక ఇంత పెద్ద నదిని చూడలేదతను. ఎంతో పొడవు, మరెంతో విశాలంగా వున్న ఆ నదిలో 'హరహర గంగే' అని అరుస్తూ, వేలాదిమంది మనుషులు మునుగుతూ స్నానం చేస్తూ, ఆ కుష్ఠురోగికి కనబడ్డారు.

అతను కూడా ఉత్సాహంగా నీటి దగ్గరికి వెళ్ళాడు. ఏదో ఆలోచన రావడంతో కదలకుండా అక్కడే ఠక్కున ఆగిపోయాడు. ముందుకు ఒక్క అడుగు కూడా వేయలేకపోయాడు. ఓసారి స్నానంచేస్తున్న వేలాదిమంది మనుషుల వంక తేరిపార చూసాడు.

'అంతమంది ఎన్నెన్ని పాపాలు చేసుంటారో కదా! పాపం. అవన్నీ ఈ గంగమ్మ తల్లి స్వీకరించాల్సిందే కదా' అన్న ఆలోచన కలిగిందతనికి.

'నిత్యం వేలాదిమంది పాపాలని స్వీకరిస్తున్న గంగాదేవికి తన పాప భారం కూడా ఎందుకు యివ్వాలి' అనిపించిందతనికి. తను చేసిన పాపాన్ని తనే భరించడం న్యాయమనిపించింది. అంతే! గంగానదిలోకి దిగకుండా ఆమెకు నమస్కరించి వెనుతిరిగాడు.

అతను యింకో అడుగు వేసాడో లేదో, ఆశ్చర్యంగా అతడికున్న కుష్ఠువ్యాధి మొత్తం మాయమై, క్షణంలో పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు.

తన స్వార్థాన్ని చంపుకుని, గంగానదికి హాని చేయరాదన్న అతని ధార్మిక ఆలోచనా గంగే, ఆ నది మీద అతనికి కలిగిన అసాధారణ దయే అతణ్ణి ఆరోగ్యవంతుడ్ని చేసింది.

## 37. చీపురు

ఓ రాజుగారు అనేక సంవత్సరాలు అన్నిరకాల వ్యామోహాలతో భోగవంతమైన జీవితంలో మునిగి తేలాక, తను చేసిందంతా పాపం అని, అది తనని జంతు జన్మలకి తీసుకెళ్తుందని గ్రహించాడు.